
08ATP27_08ATP27.qxd 08-11-2024 PM 10:54 Page 1






## కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు కూల్చేవరకు నేను విరమించే ప్రశ్నేలేదు- దేవెగౌడ శపథం

**పాండవపుర (మండ్యజిల్లా ),నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**


మాజీ ప్రధాని దేవెగౌడ.

కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారును తొలగించేవరకు నేను పోరాటాన్ని విరమించే ప్రశ్నే లేదని మాజీ ప్రధాని దేవెగౌడ శపథం చేశారు.ఆయన శుక్రవారం మండ్యజిల్లా పాండవపుర తాలూకాలోని ఎలెకెరె గ్రామంలో మాజీ మంత్రి సిఎస్.పుట్టరాజుకు చెందిన పియు కాలేజీ నూతన హాస్టల్ కట్టడాన్ని ప్రారంభించి సభలో మాట్లాడారు.నా 62సంవత్సరాల రాజకీయ జీవితంలో ఇపుడున్న కాంగ్రెస్ సర్కారు లాంటి దానిని ఎప్పుడు చూడలేదని అన్నారు.ఈసర్కారు అన్నింటా లూటీ చేస్తోంది.ఈ సర్కారును సాధ్యమైనంత త్వరగా గద్దె నుంచి దింపేవరకు నేను రాజకీయాల్లో విశ్రమించే ప్రసక్తే లేదని దేవెగౌడ చెప్పారు.ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ బెంగళూరు రౌడీ కొత్వాల్ రామచంద్ర వద్ద 100రూపాయల పనికి జీతం ఉన్నాడు.ఆయన ఇపుడు రాష్ట్రాన్ని శాసించే స్థితికి చేరుకున్నాడు.ఇదంతా కాంగ్రెస్ రాజకీయాల వలనే సాధ్యపడింది.నెహ్రూ ఇందిరాగాంధీలు అధ్యక్షులుగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీకి కర్ణాటకలో ఇపుడు డికె.శివకుమార్ అధ్యక్షుడిగా ఉన్నారు.ఆయనకు కన్నీరు విలువ అంటే ఏమి తెలుస్తుందని చెప్పారు.దేవెగౌడ కుటుంబానికి కన్నీరు వరదానంగా వచ్చింది.రైతుల కష్టాలను చూస్తే నేను కన్నీరును ఆపుకోలేను. ఇలాంటి సూక్ష్మ మనస్సున్న నా కుటుంబాన్ని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేయటం బాగోలేదన్నారు. కర్ణాటకలో సిద్దరామయ్య సర్కారును తొలగించే వరకు నేను విరమించే ప్రశ్నేలేదన్నారు.కాగా లోక్‌సభ ఎన్నికలకు మాజీ ప్రధాని దేవెగౌడ ఆయన కుమారుడు కుమారస్వామి అప్పటి ప్రధాని మోదీతో మాట్లాడుతూ కర్ణాటకలో వచ్చే నాలుగునెలల్లో కాంగ్రెస్ సర్కారును కూల్చుతామని చెప్పినట్లు సమాచారం.దీని ఆధారంగానే మోదీ దేవెగౌడ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకున్నారన్న సంగతి రాజ్యంలో గుప్పుమంది.అప్పుడు ప్రజలెవరూ ఈ సమాచారాన్ని పెద్దగా పట్టించుకోలేదు.మళ్లీ విధానసభ ఉప ఎన్నికల్లో దేవెగౌడ ఇలాంటి శపథాన్ని పునరుచ్చరించి సిద్దరామయ్య సర్కారుకు ఖెడ్డా తోడుతునట్లు పరోక్షంగా హెచ్చరికలు చేయటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## చెన్నపట్టణ కోసం కుమారస్వామి ఏంచేశారు - డికె,శివకుమార్

**చెన్నపట్టణ (రామనగర జిల్లా ),నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**


చెన్నపట్టణ విధానసభలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కెపిసిసి అధ్యక్షుడు డికె.శివకుమార్

చెన్నపట్టణ కోసం కేంద్రమంత్రి కుమారస్వామి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ ప్రశ్నించారు.ఆయన శుక్రవారం చెన్నపట్టణలో కాంగ్రెస్ అభ్యర్థి సిపి.యోగేశ్వర్ తరపున ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.చెన్నపట్టణ ప్రజల కోసం 50ఎకరాలు కొనుగోలుచేసి పేదలకు ఇళ్లను పంచిపెడుతున్నాను.నా సొంతూరు దొడ్డాలహళ్లిలోని మానాన్న కెంపేగౌడకు చెందిన 25ఎకరాల భూమిని గ్రామీణభాగంలోని పేద విద్యార్థుల చదువుల కోసం మూడుచోట్ల కనకపుర తాలూకాలోని హైస్కూలు కాలేజీకి దానం చేశాను.కుమారస్వామి కానీ మాజీప్రధాని దేవెగౌడ కుటుంబం హాసన్‌లో కానీ రామనగర జిల్లాకు చెన్నపట్టణ కోసం ఒక్క కుంట భూమిని దానం చేశారా అని నిలదీశారు.బెంగళూరు చుట్టుపక్కల,బిడది ఫిర్కాలో పేదల భూములను స్వాధీనం చేసుకుని తమ భూముల్లో కలుపుకున్న ఈ నాయకులు పేదల గురించి ఏమి అభివృద్ధి చేశారని నిలదీశారు.చెన్నపట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి సిద్దరామయ్య గతంలో 500కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు.ఇటీవల కూడా చెన్నపట్టణ పనుల కోసం కోట్లాది రూపాయల ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చారు.కాంగ్రెస్ అభ్యర్థి యోగేశ్వర్ తాను ఎంఎల్‌ఎగా పనిచేసే సమయంలో చెన్నపట్టణ చుట్టుపక్కల 19చెరువులను శింషా నీటితో నింపారు.ఈ ప్రదేశాల పాలిట అపరభగీరధుడుగా యోగేశ్వర్ పనిచేశారన్నారు.ఈ ప్రాంతంలోని పేదల కోసం వేలాదిమందికి నెలకు గృహలక్ష్మి పథకంలో రెండువేల రూపాయలను నెలానెల అందిస్తున్నాము.ఈసారి కాంగ్రెస్ గెలిస్తేనే చెన్నపట్టణ రూపురేఖలు మారుతాయని అన్నారు.చెన్నపట్టణ ప్రాంతాన్ని బెంగళూరు దక్షిణజిల్లాలో చేర్చి ఇక్కడి రైతుల భూములకు మంచి ధరను ఇప్పిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ చెప్పారు.ఆయన శుక్రవారం చెన్నపట్టణ తాలూకాలోని యోగేశ్వర్ సొంతూరు చెక్కరె ,హొన్ననాయకనహళ్లి తదితర చోట్ల ఎన్నికల ప్రచారం జరిపారు.

## అనారోగ్యం చికిత్సకోసం డిసెంబర్‌లో అమెరికా వెళ్లనున్న కన్నడ హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్

**బెంగళూరు,నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**


కన్నడ హ్యాట్రిక్‌హీరో శివరాజ్‌కుమార్.

బహుబాష నటుడు కన్నడ హ్యాట్రిక్‌హీరో శివరాజ్‌కుమార్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న విషయం విదితవే.తన ఆరోగ్య సంరక్షణ కోసం వచ్చేనెల డిసెంబర్‌లో అమెరికాలో నెలరోజులపాటు చికిత్స తీసుకుంటామని శుక్రవారం మీడియాకు చెప్పారు.నేను అనారోగ్యంతో ఉన్నా కూడా కన్నడసినిమాల్లో నటించి వాటిని పూర్తిచేసే పనుల్లో ఉన్నాను.అనారోగ్యం నన్ను పెద్దగా బాధించలేదు.అయితే దీనికి ఇప్పటికే రెండు సెషన్లలో ట్రీట్‌మెంట్ తీసుకున్నాను.మూడో సెషన్ ట్రీట్‌మెంట్ కోసం అమెరికా వెళతామని తెలిపారు.అక్కడ చికిత్స చేయించుకున్న తరువాత సంక్రాంతి నాటికి ఇండియాకు వచ్చి మళ్లీ సిన్మా షూటింగుల్లో పాల్గొంటామని తెలిపారు.శివరాజ్‌కుమార్ నటించిన భైరతీ రణగల్ యాక్షన్ మూవీ ఈనెల 15న వెండితెరకు విడుదల కానుంది.ఈ సిన్మాద్వారా శివరాజ్‌కుమార్ మరో లెవెల్ నటన అభిమానులకు కనిపించనుంది.

## సిద్దరామయ్యను రాజకీయంగా ఫినిష్ చేస్తే కాంగ్రెస్ ఫినిష్ అయినట్టే అనే భ్రమల్లో ఉన్న కేంద్రసర్కారు - సిద్దరామయ్య

**బెంగళూరు,నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**


బెంగళూరులో శుక్రవారం మీడియాతో మాట్లాడిన సిఎం సిద్దరామయ్య.

ప్రధాని మోదీ పంటికింద రాయిలాగా తగులుతున్న నన్ను రాజకీయంగా ఫినిష్ చేస్తే దేశంలో కాంగ్రెస్ పని ముగిసిందే అనే భ్రమల్లో ప్రధానిమోదీ ఉన్నారని కర్ణాటక సిఎం సిద్దరామయ్య అన్నారు.ఆయన శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.ప్రధాని మోదీ దేశ ప్రజలకు చేస్తున్న మోసాలను నేను నిర్భయంగా ప్రశ్నిస్తుండటం వలన నన్ను రాజకీయ రంగం నుంచి తొలగించేందుకు కేంద్రబిజెపి సర్కారు కుట్ర పన్నిందని ఆరోపించారు.దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మోదీని నేరుగా ఎదిరించటంలేదన్నారు.కర్ణాటక సర్కారు కేంద్ర బిజెపి సర్కారుకు కంట్లో నలుసులాగా మారి వారికి నిద్ర లేకుండా చేసిందన్నారు.ఈ కారణం చేతనే మోదీ సర్కారు నన్ను టార్గెట్ చేసి అనవసరమైన అసత్యాలతో దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.కర్ణాటక సర్కారు విజయవంతంగా అమలుచేస్తున్న అయిదు గ్యారంటీపథకాలు బిజెపి సర్కారుకు రుచించటంలేదు.ఈకారణం చేతనే నా సర్కారును కూలదోసేందుకు అడ్డదారుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలను నాపైకి ఉసిగొలిపిందని ఆరోపించారు.ముడా కేసుకు నాకు అస్సలు సంబంధం లేదు..దీంట్లో నేరుగా నాపాత్ర ఏదీలేదు.నేను ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదు.నాపై చేసిన ఆరోపణలన్నీ ద్వేషంతో కూడుకున్నవే కానీ ఏదీ చట్టబద్దత లేవని అన్నారు. సిఎంపైన ఆరోపణలు వస్తే గవర్నర్ మొదట నన్ను సంప్రతించి ఆతరువాత విచారణకు ఆదేశించాల్సి ఉంటే గవర్నర్ అమల్లో ఉన్న అన్ని చట్టనిబంధనలను తుంగలో తొక్కి నాపైన ప్రాసిక్యూషన్‌కు ఆదేశించారు.ఇది ముమ్మాటికి ద్వేషపూరిత రాజకీయం తప్పా మరొకటి కాదని అన్నారు.ఈసారి 13న జరిగే మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.వక్ఫ్ భూములు అన్యాక్రాంతం జరిగిందని బిజెపి సర్కారే గతంలో వక్ఫ్ భూముల స్వాధీనానికి నోటీసులు జారీ చేసింది. ఈసారి వీటిని ఆపుచేయించాలని ఇప్పటికే నేను ఆదేశించాను.రైతులకు వక్ఫ్ పేరిట పట్టాపేపర్లలో దొర్లిన తప్పులను సరిచేస్తామన్నారు.రైతులకిచ్చిన నోటీసులను వాపస్ తీసుకోవాలని రెవెన్యూశాఖ ఇవాళ అన్ని అధికారులకు ఆదేశించింది.వక్ఫ్ ఆస్తుల సేకరణ నిలుపుదల చేస్తున్నామని సిఎం చెప్పారు.కర్ణాటకలో బిజెపి ప్రముఖ నాయకులు అందరూ ఏదో ఒక అక్రమ కేసులో ఉన్నారు.ఇలాంటి నాయకులు ఏముఖం పెట్టుకుని నా రాజీనామాకు డిమాండ్ చేస్తారని నిలదీశారు,మాజీ సిఎం యడ్యూరప్ప పోక్సో కేసులో నిందితులు.ఆయన నా రాజీనామా అడిగేందుకు ఏమి నైతికబాధ్యత ఉందని ప్రశ్నించారు.కర్ణాటక సర్కారు దిగ్విజయంగా అమలుచేస్తున్న అయిదు గ్యారంటీ పథకాలు ఎప్పటికి నిలపబోమని స్పష్టీకరించారు.ఈ పథకాలు రాష్ట్ర ప్రజల్లో ధైర్యాన్ని తెచ్చాయన్నారు.కర్ణాటకలో లక్షా 23వేల ఎకరాలు వక్ఫ్ ఆస్తులుగా ఉన్నాయి.వీటిని పునర్‌పరిశీలించి రైతులకు అన్యాయం జరిగిన చోట సరిచేస్తామని సిఎం సిద్దరామయ్య చెప్పారు.

## బెంగళూరులో సంపిగె థియేటర్ ఇంట్లో జరిగిన కిలో ఆభరణాల చోరీకేసులో నేపాలీ దంపతులను అరెస్టు చేసిన పోలీసులు

**బెంగళూరు,నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలోని మల్లేశ్వరం ఏరియాలో ఉన్న ప్రఖ్యాత సంపిగె సినిమాహాల్ ఓనరుఇంట్లో జరిగిన ఆభరణాలచోరీకి సంబంధించి జయానగర్ పోలీసులు శుక్రవారం ముంబాయిలో నేపాలీ దంపతులు సంతోష్ గీతాలను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను నగదును రికవరి చేశారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంపిగె థియేటర్ ఓనరు నాగేష్ జయనగర్‌లో నివసిస్తున్నారు.ఆయన ఇంట్లో పనికోసం రెండు సంవత్సరాల కిందట నేపాలీ దంపతులను నియమించుకున్నారు.గత రెండు సంవత్సరాలుగా నమ్మకంగా పనిచేసిన ఈ దంపతులు నేను ఇంట్లో ఒంటరిగా ఉన్నపుడు పథకం ప్రకారం ఇంటికి కన్నంవేసి నన్ను కట్టిపడేశారు.ముఖాలకు మాస్కులు ధరించిన ఈ దంపతులు నా ఇంట్లో ఉన్న కిలోకు పైగా బంగారు ఆభరణాలను రెండులక్షల రూపాయల నగదును దోచుకుని ఇంటి నుంచి పరారయ్యారు.ఈసంఘటన గత అక్టోబర్ 2న జరిగింది.ఇంట్లో జరిగిన దోపిడి గురించి జయనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాను.దుండగుల కదలికలు మొబైల్ నెట్‌వర్కు మరియు సిసి టీవి ఫుటేజి ఆధారంగా పోలీసులు వెంబడించి దుండగులను ముంబాయిలో ఇవాళ అరెస్టు చేశారని సిన్మాథియేటర్ ఓనర్ నాగేశ్ చెప్పారు.నా ఇంట్లోజరిగిన దోపిడీ గురించి బెంగళూరు పోలీసులు దుండగులను వెదకి అరెస్టు చేయటం పట్ల నాగేష్ నగర పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## బెంగళూరు జలమండలి చేత నీటితీరువా పన్నులు పెంపునకు కసరత్తు

**బెంగళూరు,నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరుకు కావేరి నదినుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు తొరెకాడనహళ్లి వద్ద ఏర్పాటుచేసిన పంపింగ్ హౌసుల నుంచి నగరానికి 300మీటర్ల ఎత్తుకు నీటిని తరలించటానికి పెద్దఎత్తున విద్యుత్తు ఖర్చుకావటంతో బెంగళూరు జలమండలి నగరంలో నీటి పన్నులను పెంచేందుకు కసరత్తు ప్రారంభించింది.జలమండలికి భారంగా తయారైన విద్యుత్ బిల్లులను కట్టేందుకు మండలి వేరేదారిలేక నీటి పన్నులు పెంచేందుకు సిద్దమైంది. ఇప్పటికే దీనికి సంబంధించి బెంగళూరు నగారాభివృద్ధి మంత్రి డికె.శివకుమార్ జలమండలి నీటిపన్నుల పెంపుపట్ల ఒక ప్రకటన చేశారు.నగర ప్రజలు నీటి పన్నులను చెల్లించేందుకు సిద్దంగా ఉండాలని మనవి చేశారు.బెంగళూరులో జలమండలి పది సంవత్సరాల కిందట నీటి పన్నులు పెంచింది.ఈ మధ్య కాలంలో పాత ధరల ప్రకారమే నీటిని సరఫరా చేస్తోంది.కొత్త ధరల వలన జలమండలి పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని బెస్కాం విద్యుత్‌బిల్లుల చెల్లింపులకు వినియోగిస్తామని జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాత్ మనోహర్ శుక్రవారం చెప్పారు.అయితే తాము నీటిపన్నులు 18నుంచి 24శాతం వరకు పెంపుచేయాలని ప్రతిపాదనలు పెడుతున్నట్లు తెలిపారు.సర్కారు అనుమతించిన తరువాతనే నీటిపన్నుల పెంపు అమల్లోకి వస్తుందన్నారు.

## పోక్సో కేసులో యడ్యూరప్ప పైన దర్యాప్తు కోసం ఫైనల్ ఛార్జిషీటును కోర్టుకు సమర్పించిన సిఐడి పోలీసులు

**బెంగళూరు, నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**

పోక్సో కేసులో మాజీ సిఎం యడ్యూరప్ప పైన దర్యాప్తు జరిపిన సిఐడి పోలీసులు శుక్రవారం బెంగళూరు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తుదివిడత ఛార్జిషీటును సమర్పించారు.తన కూతురుకి న్యాయం చేయాలని మాజీ సిఎం యడ్యూరప్ప ఉండే బెంగళూరు డాలర్స్‌కాలనీ నివాసానికి వెళితే కూతురును ప్రశ్నించేందుకు రూములోనికి తీసుకువెళ్లిన యడ్యూరప్ప తన కూతురుపైన అత్యాచారానికి ప్రయత్నించారని బాధితురాలి తల్లి సదాశివ నగర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఈకేసును దర్యాప్తు చేస్తున్న సిఐడి పోలీసులు ఇప్పటికే ప్రాథమిక వివరాలు ఉన్న ఒక నివేదికను కోర్టుకు సమర్పించారు. యువతిపైన అత్యాచారం జరిగిన రోజు యడ్యూరప్ప నివాసం ధవళగిరికి ఎవరెవరు వచ్చి వెళ్లారనే డైలీ రిజిస్టర్‌లో దాఖలైన సమయాలను వ్యక్తుల వివరాల గురించి సిఐడి పోలీసులు ఫోరెన్సిక్‌సైన్సు ల్యాబరేటరి కు వివరాలను సమర్పించారు. సదరు ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక ఇవాళ అందటంతో పోలీసులు ఫైనల్ ఛార్జిషీటును కోర్టుకు సమర్పించారు.యడ్యూరప్ప ప్రస్తుతం కోర్ట్ బెయిల్ పైన బయట సంచరిస్తున్నారు.ఈయనపైన కేసు విచారణకు సిఐడి అధికారులు కోర్టుకు ఇవాళ మనవి చేశారు.

## బెంగళూరు నగరంలో 1500కు పైగా అక్రమ కట్టడాల నిర్మాణం

### - బిబిఎంపి కమిషనర్ తుషార్‌గిరినాథ్ వెల్లడి

**బెంగళూరు,నవంబర్ 8,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలో మహానగర పాలికె దృష్టికి తీసుకురాకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు తీసుకోకుండా సుమారు 1500బిల్డింగులు అక్రమంగా నిర్మించారని వీటిని త్వరలో కూల్చివేస్తామని పాలికె ప్రధాన కమిషనరు తుషార్ గిరినాథ్ చెప్పారు.ఆయన శుక్రవారం ఈమేరకు బెంగళూరులో మీడియాతో మాట్లాడారు.బెంగళూరు బయటిభాగంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అక్రమంగా అపార్టుమెంట్ బిల్డింగులు నిర్మిస్తున్నారని చెప్పారు.వీటిలో అత్యధికభాగం బిల్డింగులు యలహంక నియోజకవర్గంలోనే ఉన్నాయి.అక్కడ 500కు పైగా అనుమతులు లేని బిల్డింగులు నిర్మాణం జరిగింది.వీటిని వెంటనే కూల్చివేసేందుకు ఆయా భవనాల ఓనర్లకు నోటీసులు ఇచ్చాము.వారంతట వారే సదరు బిల్డింగులను కూల్చివేసి భవనశిధిలాలను వారే సొంత ఖర్చుతో తరలించాలని ఆదేశించారు.బిల్డింగ్ ఓనర్లు వారంలోగా బిబిఎంపి నోటీసులకు స్పందించి జవాబివ్వాలి లేదంటే పాలికె అధికారులు బిల్డింగులను డిమాలిష్ చెస్తారని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికై గ్రామ సభలు

### - ప్రత్యేక అధికారి

**అగళి, నవంబర్ 8 ప్రభాతవార్త**


గ్రామ సభలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక పంచాయితీల వారీగా జరుగుతున్న గ్రామ సభలే కారణమని ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, తహశీల్దారు సుబ్బారావు అన్నారు. ఆలూరు పంచాయితీ పరిధిలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈగ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా జేసి లాగిన్, రెండు లక్షల ఖాతా, జేసి లాగిన్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను రైతుల అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, సర్వేయర్ మారుతి, జీవన్, విఆర్ఓ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

## హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిభిరం

**పావగడ, నవంబర్ 8 ప్రభాతవార్త**


రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో శుక్రవారం హెల్త్ సొసైటీ సేవా ట్రస్ట్ బెంగళూరు శంకర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్సా శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిభిరంలో దాదాపు వంద మంది దాకా కంటి పరీక్షలు చేయించుకున్నారని 60 మంది దాకా కంటి ఆపరేషన్లకు ఎంపికైనారని వీరిని బెంగుళూరు శంకర్ ఆసుపత్రి తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా సూరపనేని విద్యాసాగర్, సేవా ట్రస్ట్ సంధ్యా, నర్సింహమూర్తి, బెంగుళూరు శంకర్ నేత్రాలయ సభ్యులు పాల్గొన్నారు.

## ధర్మవరం చెరువు భూముల ఆక్రమణల ఆరోపణలపై..

### న- సోషల్ మీడియా ద్వారా స్పందించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ధర్మవరం, నవంబర్ 8 ప్రభాతవార్త**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో ధర్మవరంచెరువు భూములు కబ్జా చేశారంటూ శుక్రవారం ఓ దినపత్రికతోపాటు పలు టీవీ ఛానెళ్లలో ప్రసారం కావడంతో విషయం తెలుసుకున్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దైవ దర్శనం నిమిత్తం ఇతర రాష్ట్రాల పర్యటనలో ఉండటంతో సోషల్ మీడియా ద్వారా తన వివరణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన జీవో ప్రకారం ఆ భూములు అన్ని కూడా నిబంధనలప్రకారం ఉన్నాయని, అప్పటి జిల్లా కలెక్టర్‌నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు సర్వేలు చేసి అన్ని రికార్డులు స్పష్టంగా ఉ న్నాయని పేర్కొనడం జరిగిందని, అంతేకాకుండా గతంలో కూడా ఇలాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కొందరు కోర్టుకు కూడా వెళ్లడం జరిగిందని, పూర్తి వివరాలను పరిశీలించిన హై కోర్టు వారు ఈ నోటీసులను కొట్టివేయడం కూడా జరిగిందని, అయితే ప్రస్తుతం తిరిగి పై అధికారుల ఒత్తిళ్ల మేరకు ప్రస్తుతం కలెక్టర్ తమ కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, తాను ప్రస్తుతం ఇతర ప్రాంతాల పర్యటనలో ఉన్నందున తిరిగి ధర్మవరం చేరిన వెంటనే ప్రజల ముందుకు నిజానిజాలు ఏంటనే సోషల్ మీడియా ద్వారా ప్రజలు ముందుకు తీసుకురావడం జరుగుతుందని వివరించారు. కోర్టులో ఉన్న భూములపై ప్రస్తుతం ఉన్న అధికారులు కూటమి ప్రభుత్వం నోటీసులు ఎలా జారీ చేస్తుందని ఆయన ప్రశ్నించారు. వీటన్నింటిపై మరొకసారి కోర్టును ఆశ్రయిస్తామని,క ఆర్తిక మాసం సందర్భంగా ప్రస్తుతం తాను అందుబాటులో లేనని ధర్మవరం వచ్చిన తర్వాత అన్ని ఆధారాలతో నిజాలు ఏంటనేది వెల్లడిస్తానని తెలిపారు.

## ఘనంగా లాల్ కృష్ణ అద్వానీ జన్మదినం

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 08 ప్రభాతవార్త**


కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న బిజెపి నాయకులు

లాల్ కృష్ణ అద్వానీ జన్మదినాన్ని బిజెపి జిల్లా కార్యయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పుట్టపర్తి కార్యాలయంలో కేక్ కట్‌చేసి బిజెపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశ్వారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్దాంతాల కోసం వన్నుచూపని గిప్పనేత దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత రథయాత్రతో భారతీయులను ఐక్యం చేసిన స్ఫూర్తిప్రదాత పదవికి వన్నె తెచ్చిన మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ హరికృష్ణ గౌడ్ జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్ జిల్లా కోశాధికారి సురేంద్ర బాబు జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ బాలగంగాధర్ జిల్లా కార్యాలయ ఇన్చార్జ్ భాస్కర్ జి పట్టణ అధ్యక్షులు సోకే రామాంజనేయులు,ధనుంజయ రెడ్డి,మనోజ్.నారాయణ.స్వామి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బావిలో దిగి రైతు కూలీ మృతి

### - సంఘటనా స్థలం వద్దకు వెళ్లిన పరిటాల సునీత


బావిలో మృతదేహాన్ని గాలింపు పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**కనగానపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త**

మండలంలోని ముక్తాపురం గ్రామానికి చెందిన రైతు కూలీ దాసరి రామాంజినేయులు (40) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు మృతుడు ధర్మవరం మండలం కట్టకిందపల్లి గ్రామంలో వ్యవసాయ బావిలో పాడైపోయిన మోటార్‌ను బయటికి తీసేందుకు ఆ రైతు కూలీ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసేందుకు పోలీసులు గజ ఈతగాళ్ల అగ్నిమాపక సిబ్బంది బావిలో దిగి ఎంత గాలించినా మృతదేహం కనపడకపోవడంతో ఇటీవలకురిసిన వర్షాలకు గట్టునున్న వేప చెట్టు బావిలో పడిపోవడంతో జేసిబి సాయంతో బయటకు తీసివేశారు. అలాగే చెరువు పక్కనే ఈ బావి ఉండటంతో నాలుగు మోటార్లు నీటిని పంపించేసి యబటికి తోడేస్తున్నప్పటికీ ఊట నీరు ఎక్కువ రావడంతో శనివారం ఉదయం మృతదేహం లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మృతునికి భార్య కలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రమాద ఘటన జరిగిన భావి వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెంటనే తీసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. మృతుని కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. అన్ని విధాలుగా మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## వాల్మీకి జయంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

**గుడిబండ, నవంబర్ 8 ప్రభాతవార్త**


భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాయణం మహాకావ్యాన్ని రచించి ప్రపంచ మానవాళి మనుగడకు మార్గనిర్దేశం చేసిన మహానుభావుడు అని కొనియాడారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి ప్రతిష్టాపన భూమి పూజ నిర్వహించారు. మహిళలు పూల హారతులతో వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప , తేదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్ డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎంపిటిసి వనజా శశిధర్, లాయర్ శివకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జులు లక్ష్మినరసప్ప, భీమరాజు, మాజీ ఎంపిటిసిలు భోజరాజు, వెంకటేష్, కాంతరాజు, డీలర్ జనార్ధన్, బాదివల్లెప్ప, జనసేన నాయకులు మంజునాథ్, రమేష్,రాజు,మారుతి,బల్లేకట్టఈరన్న, వెంకట రమణ, శ్రీనివాస్, తదితర వాల్మీకి కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### - 52వేలు నగదు స్వాధీనం

**గుడిబండ, నవంబర్ 8 ప్రభాతవార్త**


పేకాట రాయుళ్లను చూపుతున్న పోలీసులు

మండల పరిధిలోని ఆచారి పాళ్యంగ్రామ శివారులో సిఐ రాజకుమార్‌ఆధ్వర్యంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గుడిబండ పోలీసులతో కలిసి చేసిన మెరుపు దాడిలో గుడిబండ, రొళ్ల మండలాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆరు మందిని అదుపులోకి తీసుకున్నామని, ఐదు మంది పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నామని, వారి వద్ద నుంచి 52వేల 2 వందల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో గుడిబండ, మడకశిర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాళ్లపల్లి, శంకరగల్లులో రెవెన్యూ సదస్సులు

**గుడిబండ, నవంబర్ 8 ప్రభాతవార్త**


గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని రాళ్లపల్లి, శంకరగల్లు గ్రామ పంచాయితీలలో శుక్రవారం రెవెన్యూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దారు కళ్యాణ్ చక్రవర్తి రైతుల నుంచి 19 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత అర్జీలను పరిశీలించి సంబంధిత రైతులకు పరిష్కారం అందే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మహ్మద్ బిలాల్, విఆర్‌ఓలు రామాంజినేయులు, సాయిసంధ్య, సర్పంచులు జయమ్మ, నరేంద్ర, లక్ష్మినారాయణ, ఎంపిటిసి పుష్పలత నాగేంద్ర, మాజీ ఎంపిటిసి నజీర్, మాజీ సర్పంచు నారాయణప్ప, తేదేపా నాయకులు బాదిపల్లప్ప, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని బాలికకు గాయాలు

**చెన్నేకొత్తపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త**

మండలం కనుముక్కల గ్రామానికి చెందిన గాయత్రి (8) డా/ఆఫ్ వెంకటేష్ అను బాలిక తన ఇంటి వద్ద నుండి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం గాయత్రిని ఢీ కొట్టింది. గాయత్రి తలకు తీవ్రమైన గాయం అయినందున కుటుంబ సభ్యులు గమనించి గాయత్రిని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చి చికిత్స చేయించారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గాయత్రిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


చికిత్స పొందుతున్న గాయత్రి

